ప్రభాత
# జయభేరి
తెలుగు దినపత్రిక
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
13-08-2024
మంగళవారం
మల్కాజిగిరి
సంపుటి : 01 | సంచిక : 341 | పేజీలు : 8 | వెల : 4
JB జయభేరి



## గొలుసుకట్టు చెరువులన్నీ పునరుద్ధరిస్తాం

▸▸ హైడ్రా కమిషనర్ రంగనాథ్

జయభేరి, హైదరాబాద్, ఆగష్టు 12:

గొలుసుకట్టు చెరువులన్నీ పునరుద్ధరిస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. చెరువులకు నీటిని మళ్లించే నాలాలు పూడుకుపోయాయని, అవకాశవాదం వల్ల గొలుసుకట్టు చెరువులన్నీ మాయమయ్యాయని, చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లో ఎవరూ స్థలాలు కొనుగోలు చేయవద్దని సూచించారు. సోమవారం రంగనాథ్ మీడియాతో మాట్లాడారు. చెరువుల పరిరక్షణకు అందరితో కలిసి మేథోమదనం చేస్తామని, పార్కు స్థలాలు పరిరక్షించే కాలనీ సంఘాలను సమర్థిస్తామని, పార్కు స్థలాల్లో ఫెన్సింగ్ వేసేందుకు కాలనీ సంఘాలు సహకరిస్తున్నామని, బస్తీ వాసుల మెరుగైన జీవన ప్రమాణాలు పెరగాలని, నందగిరి హిల్స్ సొసైటీతో మాకు ఎలాంటి ఒప్పందం లేదని, చందానగర్‌లో గతేడాది బఫర్ జోన్‌లో నిర్మాణాలకు అనుమతులిచ్చారని, ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేస్తే హైడ్రా చర్యలు తప్పవని రంగనాథ్ హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో మెరుగైన ఫలితాలు చూస్తారని, బఫర్ జోన్, ఎఫ్‌టిఎల్ పరిధిలో నిర్మాణాలు కట్టాలంటే భయపడే స్థితికి తీసుకొస్తామని హెచ్చరించారు. అక్రమంగా అనుమతులు ఇచ్చే అధికారులపై విచారణ చేసి ప్రభుత్వానికి వివరిస్తామన్నారు. జిహెచ్‌ఎంసి పరిధిలో చెరువులు, కుంటలు అన్నీ కలిపి 400కిపైగా ఉన్నాయని, హైడ్రా చెరువలను ప్రధానంగా తీసుకుందని, ఎన్‌ఆర్‌ఎస్‌సి నివేదిక ప్రకారం 44 ఏళ్లలో చాలా చెరువు కనుమరుగు అయ్యాయని, చాలా చెరువులు 60 శాతం, కొన్ని 80 శాతం అక్రమణలకు గురయ్యాయని, దీంతో చెరువుల పరిధిలోని

...మిగతాది 2 లో

# రూ.31532 కోట్ల పెట్టుబడులు

- దాదాపు 30750 కొత్త ఉద్యోగాలు
- 19 కంపెనీలతో సంప్రదింపులు.. ఒప్పందాలు
- విజయవంతంగా ముగిసిన అమెరికా పర్యటన
- దక్షిణకొరియాకు బయల్దేరిన సీఎం రేవంత్ రెడ్డి



జయభేరి, హైదరాబాద్:

ముఖ్యమంత్రి అమెరికా పర్యటన విజయవంతమైంది. తెలంగాణ పెట్టుబడులకు వివిధ రంగాల్లో ప్రపంచంలో పేరొందిన భారీ కంపెనీలు ముందుకు వచ్చాయి. ఈ పర్యటనలో రూ.31532 కోట్ల పెట్టుబడులను సాధించి తెలంగాణ పెట్టుబడుల గమ్యస్థానంగా అమెరికాలోని పారిశ్రామికవేత్తల దృష్టిని ఆకర్షించింది. అమెరికా వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణను ఫ్యూచర్ స్టేట్గా ప్రకటించటం, హైదరాబాద్ 4.0 సిటీగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంచుకున్న వివిధ ప్రాజెక్టులకు భారీ స్పందన లభించింది. ఈ పర్యటనలో దాదాపు 19 కంపెనీలు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు అవగాహన ఒప్పందాలు చేసుకున్నాయి. దీంతో రాష్ట్రంలో 30750 కొత్త ఉద్యోగాలు లభించనున్నాయి. ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి ప్రభుత్వ అధికారుల బృందం ఈ నెల 3వ తేదీన అమెరికా పర్యటనకు బయల్దేరింది. ముఖ్యమంత్రి సారథ్యంలోని రాష్ట్ర ప్రతినిధి బృందం అమెరికాలో దాదాపు యాభైకి పైగా బిజినెస్ మీటింగ్, మూడు రౌండ్ మీటింగ్లలో పాల్గొంది. ప్రధానంగా అర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, ఫార్మా మరియు లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రిక్ వాహనాలు, డేటా

...మిగతాది 2 లో




## కవితకు మళ్లీ నిరాశే

జయభేరి, న్యూఢిల్లీ, ఆగస్టు 12:

కవిత బెయిల్ ప్రాసెస్‌లో ఉందని వచ్చే వారంలో బెయిల్ వస్తుందని కేటీఆర్ అంచనాలు తలకిందులు అయ్యాయి. సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేయలేదు. సీబీఐ, ఈడీ వాదనలు విన్న తర్వాతనే నిర్ణయం ప్రకటిస్తామని వాటికి నోటీసులు జారీ చేసింది. మార్చి పదిహేనో తేదీ నుంచి జైల్లో ఉంటున్న ఎమ్మెల్సీ కవితకు మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు జస్టిస్ గవాయి,

...మిగతాది 2 లో



## రాహుల్ గాంధీ ప్రమాదకర వ్యక్తి

జయభేరి, న్యూఢిల్లీ, ఆగష్టు 12:

హిమాచల్ ప్రదేశ్ లోని మండీకి చెందిన బిజెపి ఎంపీ కంగన రనౌత్, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీని తూర్పారబట్టింది. సెబీహిండెన్ బర్గ్ వివాదంలో కడిగిపారేసింది. నిష్పక్ష విచారణను ఆమె డిమాండ్ చేశారు. ఆమె తన 'ఎక్స్' పోస్ట్ లో రాహుల్ గాంధీని 'ప్రమాదకర వ్యక్తి' అని పేర్కొంది. ''రాహుల్ గాంధీ చాలా విషపూరిత, వినాశకర మనిషి. అతడి ఎజెండా ఏమిటంటే తాను ప్రధాని కాకపోతే, దేశాన్ని కూడా నాశనం చేయడానికి వెనుకాడడు'' అంది. హిండెన్ బర్గ్ రిపోర్టును రాహుల్ గాంధీ ఆమోదిస్తున్నాడని పేర్కొంది. హిండెన్ బర్గ్ నివేదిక వెలువడ్డాక రాహుల్ గాంధీ 'ఎక్స్' పోస్ట్ ద్వారా మోడీ సర్కారును జవాబులడిగారు.




## తెలంగాణ టీడీపీ పగ్గాలు నారా లోకేష్‌కా.. బ్రాహ్మణికా..?

జయభేరి, హైదరాబాద్:

తెలంగాణ తెలుగు దేశం పార్టీ బాధ్యతలు నారా లోకేశ్‌కి అప్పగించే అవకాశం ఉందా? నారా బ్రాహ్మణిని వర్కింగ్ ప్రెసిడెంట్ చేస్తారా? ఇదీ.. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకి రిపోర్టర్లు అడిగినా ప్రశ్న. మీ ఆలోచనా విధానాలు చాలా ఫాస్ట్ ఉన్నాయి. మీ అంత వేగంగా మేం ఆలోచించడం లేదు. అక్కడైనా, ఇక్కడైనా తెలుగు జాతి బాగుండాలని కోరుకునే వ్యక్తి నేను అని చంద్రబాబు స్పందించారు. ఈ కామెంట్స్ ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో వేడిని పెంచుతున్నాయి. రాష్ట్ర విభజన తరువాత టీడీపీ ఏపీకి పరిమితం అయింది. 2014 ఎన్నికల్లో ఎన్డీఏ కూటమితో పోటీచేసి.. గ్రేటర్‌లో కీలక స్థానాలను కైవసం చేసుకున్న టీడీపీ, ఆ తర్వాత పక్కకు తప్పుకుంది. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్‌తో జట్టుకట్టి మహాకూటమి పేరుతో ప్రజల్లోకి వెళ్లగా రెండుస్థానాలు గెలిచింది. ఆ ఎన్నికల్లో గెలిచిన ఇద్దరు ఎమ్మెల్యేలు అప్పట్లో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లిపోవడంతో క్యాడర్ చెరో దారి చూసుకున్నారు. విభజనకు ముందు తెలంగాణ, రాయలసీమ, కోస్తాంధ్ర మూడు ప్రాంతాల్లో గట్టి పట్టున్న టీడీపీకి.. విభజన తర్వాత తెలంగాణకు ప్రత్యేక శాఖ ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి వచ్చింది. అలా టీటీడీపీ అధ్యక్షుడిగా ఎల్ రమణను నియమించారు. 2014ఎన్నికల్లో

...మిగతాది 2 లో



## తెలంగాణలో ఇకపై స్వైపింగ్ కార్డులు

తెల్ల రేషన్ కార్డుకు అర్హత ఇదే..!

హైదరాబాద్ :

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో పాత రేషన్ కార్డుల స్థానంలో కొత్త కార్డులు ఇవ్వనున్నట్టు ప్రభుత్వం స్పష్టం చేసింది. త్వరలోనే దీనికి సంబంధించిన విధివిధానాలను ఖరారు చేయనున్నారు.వివరాల ప్రకారం.. తెలంగాణలో కొత్త రేషన్‌కార్డుల జారీపై కేబినెట్ సబ్ సమితీ సమావేశమైంది. ఈ సందర్భంగా రాష్ట్రంలో పాత రేషన్ కార్డుల స్థానంలో కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని నిర్ణయించారు. ఇక, తర్వాత జరగబోయే మీటింగ్‌లో దీనికి సంబంధించిన విధివిధానాలను ఖరారు చేయనున్నారు. కాగా, రాబోయే రేషన్ కార్డులు స్వైపింగ్ కార్డ్స్ మోడల్‌గా ఇవ్వాలని నిర్ణయించినట్టు సమాచారం.బినెట్ సబ్ కమిటీలో నిర్ణయాలు ఇవే.. ఇదిలా ఉండగా. తెలంగాణలో చాలా కాలంగా రేషన్ కార్డులు జారీ చేయకపోవడంతో లక్షలాది మంది కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో వీలైనంత త్వరగా విధి విధానాలు రూపొందించి అర్హులైన వారికి రేషన్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తోంది.

## భారత్.. భళా...



జయభేరి, తిరువనంతపురం, ఆగస్టు 12:

బంగ్లాదేశ్‌లో హింసాత్మక ఘటనల వల్ల ఆ దేశ ప్రధాని పదవికి షేక్ హసీనా రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత షేక్ హసీనాకు భారత్‌లో ఆశ్రయం ఇచ్చినందుకు కేంద్రాన్ని ప్రశంసించారు కాంగ్రెస్ సీనియర్ నేత శశి థరూర్. షేక్ హసీనా రాజీనామా చేసిన తర్వాత ఆమెకు భారత్ సాయం చేయకపోతే అది మన దేశానికే అవమానకరమని చెప్పారు. మన మిత్రులతో మనం చెడుగా ప్రవర్తిస్తే ఇకపై ఎవరూ మనకు మిత్రులు కావాలని కోరుకోరని షేక్ హసీనా చెప్పారు. షేక్ హసీనా భారత్‌కు మిత్రురాలని తెలిపారు. మిత్రులు ఇబ్బందుల్లో ఉంటే వారికి సాయం చేసే విషయంలో మరో

...మిగతాది 2 లో



## తుంగ భద్రమేనా..?

- 19వ గేటు వరద ప్రవాహానికి చైన్ లింకు తెగి కొట్టుకు పోయింది
- జలాశయంలో వరద ప్రవాహానికి 105 టీఎంసీల నీరు చేరింది

జయభేరి, కర్నూలు, ఆగస్టు 12:

ఎగువ కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాలకు తుంగభద్ర జలాశయానికి వరద ప్రవాహం పెరిగింది. జలాశయంలోని 19వ గేటు వరద ప్రవాహానికి చైన్ లింకు తెగి కొట్టుకు పోయింది. దీంతో జలాశయంలోని నీరు లక్ష క్యూసెక్కులకు పైగా నదిలోకి వెళ్తుంది. తుంగభద్ర జలాశయం గేటు కొట్టుకుపోవడంతో అసలు తుంగభద్ర జలాశయం ఇతర గేట్ల పరిస్థితి ఎలా ఉంది. గేటు కొట్టుకపోవడానికి నిర్వహణ లోపమా లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అని అధికారులు సమీక్షిస్తున్నారు. తుంగభద్ర జలాశయంలోకి

...మిగతాది 2 లో

## జయభేరిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు

...మిగతాది 2 లో



## బతుకమ్మ చీరల స్థానంలో బహుమతులు

2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## రూ.31532 కోట్ల పెట్టుబడులు

సెంటర్లు, ఐటీ ఎలక్ట్రానిక్ రంగాల్లో ప్రభుత్వంతో భాగస్వామ్యం పంచుకునేందుకు కంపెనీలు అమితమైన ఆసక్తిని ప్రదర్శించాయి. ఈ పర్యటనలో ప్రపంచంలో పేరొందిన కాగ్నిజెంట్, చార్లెస్ స్కాబ్, ఆర్సీసియం కార్నింగ్, ఆమ్జెన్, జొయిటిస్, హెచ్సీఏ హెల్త్ కేర్, వివింట్ ఫార్మా, థర్మోఫిషర్, ఆరమ్ ఈక్విటీ, ట్రైజిన్ టెక్నాలజీస్, మోనార్క్ ట్రాక్టర్ కంపెనీలు రాష్ట్రంలో విస్తరణకు, కొత్త కేంద్రాలు నెలకొల్పేందుకు తమ సంసిద్ధతను వ్యక్తం చేశాయి. వీటితో పాటు హైదరాబాద్లో తమ డేటా సెంటర్ విస్తరణకు అమెజాన్ తీసుకున్న నిర్ణయం ఈ పర్యటనలో చెప్పుకోదగ్గ మైలు రాయిగా నిలిచింది. ఈ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి బృందం ఈ పర్యటనలో యాపిల్, గూగుల్, స్టాన్ఫోర్డ్ యూనివర్సిటీలతో, ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులతోనూ చర్చలు జరిపింది. శనివారం అమెరికా పర్యటన విజయవంతంగా ముగించుకొని ముఖ్యమంత్రి దక్షిణ కొరియాకు బయల్దేరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. తమ బృందం అమెరికా పర్యటనపై ఆనందం వ్యక్తం చేశారు. ప్రపంచంలో పేరొందిన కంపెనీలతో సంప్రదింపులు, చర్చలతో తెలంగాణ ప్రభుత్వం సరికొత్త భాగస్వామ్యానికి నాంది పలికిందని అన్నారు. స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు, అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిటీ నుంచి ఫ్యూచర్ సిటీ నిర్మించేందుకు తమ ప్రభుత్వం ఎంచుకున్న ప్రణాళికలకు అమెరికాలోని పారిశ్రామికవేత్తల నుంచి భారీ మద్దతు లభించిందని అన్నారు. తెలంగాణ లక్ష్యాలకు అనుగుణంగా, రాష్ట్ర అభివృద్ధికి దోహదపడేలా ప్రఖ్యాత కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులకు తరలిరావటం శుభసూచకమని అన్నారు. అమెరికా వ్యాపార సామ్రాజ్యానికి తెలంగాణను సరికొత్తగా పరిచయం చేయగలిగామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్బాబు అన్నారు. రాష్ట్రంలో వివిధ రంగాల పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అనుకూలతలు, ప్రభుత్వం అందించే సహకారాన్ని చాటిచెప్పేందుకు ఈ పర్యటన సత్ఫలితాలను అందించిందని అభిప్రాయపడ్డారు. దీని ప్రభావంతో రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువెత్తటంతో పాటు అపారమైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయనే ఆశాభావం వ్యక్తం చేశారు.

## చెరువులన్నీ పునరుద్ధరిస్తాం

ఆక్రమణలను గుర్తిస్తున్నామని, చెరువల ఆక్రమణలను అడ్డుకోకపోతే హైదరాబాద్ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతోందని రంగనాథ్ పేర్కొన్నారు. త్వరలోనే హైడ్రాకు ప్రభుత్వం పెద్ద ఎత్తున సిబ్బందిని సమకూరుస్తుందని, హైడ్రాకు త్వరలోనే ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఉంటుందని, ప్రజల నుంచి హైడ్రాకు వందలాది ఫిర్యాదులు వస్తున్నాయని వివరించారు. 2500 చదరపు కిలో మీటర్ల విస్తీర్ణంలో హైడ్రా పరిధిలో ఉందని, దశల వారీగా హైడ్రా పని చేస్తుందని తెలియజేశారు. తొలి దశలో ఆక్రమణలను అడ్డుకోవడం హైడ్రా చేసే పని అని, రెండో దశలో ఆక్రమించి నిర్మించిన భవనాలపై చర్యలు, అనుమతుల నిరాకరణ ఉంటుందని, మూడో దశలో చెరువుల పూడిక తీసి వాన నీటిని మళ్లించి పునర్జీవనం కల్పించడం జరుగుతుందని ఆయన వివరణ ఇచ్చారు.

## తెలంగాణ టీడీపీ పగ్గాలు

ఏపీలో అధికారంలోకి వచ్చినా... తెలంగాణలో మాత్రం అనుకున్న ఫలితాలు రాలేదు. 2018 ఎన్నికల తర్వాత టీడీపీ పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. ఎల్ రమణ బీఆర్ఎస్‌లో చేరడంతో పార్టీ సీనియర్ నేత బక్కని నర్సింలుకు తెలుగు దేశం బాధ్యతలు అప్పగించారు. ఆయన సారథ్యంలోనూ టీటీడీపీ అభివృద్ధి దిశ వైపు నడుస్తున్న తరుణంలో ఆయనను పదవి నుండి తొలగించారు. టీడీపీ మరింతగా ప్రాభవం కోల్పోయింది. 2019లో ఏపీలోనూ తెలుగు దేశం పార్టీ ఓడిపోవడంతో తెలంగాణలోనూ ఆ పార్టీ గడ్డుపరిస్థితులు ఎదుర్కొంది. నేతలు పార్టీ మారినా. ఏళ్ల తరబడి టీడీపీ సిద్ధాంతాన్ని నమ్ముకుని వెన్నంటే ఉండే కార్యకర్తలు తెలుగు దేశానికి వెన్నెముకగా నిలిచారు. అదే.. ఇప్పటికీ తెలంగాణలో టీడీపీకి బలమైన క్యాడర్ ఉండేలా చేసింది. ఏపీలో కూడా ఓడిపోవడంతో పార్టీ అధ్యక్ష బాధ్యతలను బీసీ నేత కాసాని జ్ఞానేశ్వర్‌కు అప్పగించారు. అయితే 2024 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేయొద్దని టీడీపీ అధిష్టానం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆయన తన పదవికి రాజీనామా చేశారు. అనంతరం మాజీ సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లోకి చేరారు. అలా వరుసగా పార్టీ అధ్యక్షులే ఇతర పార్టీల్లోకి జంప్ కావడంతో క్యాడర్ మరింత డీలా పడింది. ఏపీలో అయిదేళ్ల అరాచకపాలనను అంతమొందిస్తూ.. టీడీపీ సారథ్యంలోని ఎన్డీయే కూటమి 2024 అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం చేపట్టింది. ఇక తెలంగాణపైనా ఫోకస్ పెడతామన్న చంద్రబాబు.. అందుకు తగినట్లే అడుగులు వేస్తున్నారు. శనివారం ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌కి వచ్చిన ఆయన కీలక నిర్ణయం తీసుకున్నారు. టీటీడీపీలో పాత కమిటీలను రద్దు చేస్తూ నిర్ణయించారు. పార్లమెంట్, అసెంబ్లీ సెగ్మెంట్‌ల వారిగా ఉన్న కమిటీలను రద్దు చేశారు. ఏపీ, తెలంగాణలలో ఒకేసారి కొత్త కమిటీలు ఏర్పాటు చేయాలని నేతలకు దిశానిర్దేశం చేశారు. కమిటీల ఏర్పాటు అనంతరం టీటీడీపీ అధ్యక్షుడిని ప్రకటిస్తారని సమాచారం. అయితే తెలంగాణలోనూ పునర్వైభవం సాధించాలని చూస్తున్న టీడీపీ ఈసారి పెద్ద నేతలనే రంగంలోకి దింపాలని చూస్తోంది. టీటీడీపీ అధ్యక్ష బాధ్యతలను నారా బ్రాహ్మణి లేదంటే నారా లోకేష్‌కి ఇస్తారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇదే విషయాన్ని రిపోర్టర్లు ప్రశ్నించగా.. బాబు కూడా నవ్వుతూ సమాధానమిచ్చారు. చంద్రబాబే రంగంలోకి దిగడంతో తెలంగాణలో టీడీపీకి పునర్వైభవం రావడం పక్కా అని ధీమా వ్యక్తం చేస్తున్నారు తెలంగాణ తెలుగు తమ్ముళ్లు.

## భారత్.. భళా...

ఆలోచనలేవీ పెట్టుకోవద్దని చెప్పారు. ఆమెను ఇక్కడికి తీసుకువచ్చి, భద్రత కల్పించి భారత ప్రభుత్వం సరైన పని చేసిందని అన్నారు. అలాగే, బంగ్లాదేశ్‌లో అధికార మార్పిడి భారతదేశానికి కూడా మొదట ఆందోళన కలిగించదని చెప్పారు. బంగ్లాదేశ్‌లో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు భారత్‌తో ఆ దేశ సంబంధాలను ఎలా ప్రభావితం చేస్తాయనే దానిపై తాజాగా ఓ ఇంటర్వ్యూలో శశి థరూర్ తన అభిప్రాయాలు తెలిపారు. బంగ్లాదేశ్‌తో సత్సంబంధాలు కొనసాగించడానికే భారత్ ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. బంగ్లాదేశ్‌కు భారత్ మొదటి నుంచి మద్దతు తెలుపుతోందని, 1971 యుద్ధం సమయంలోనూ మద్దతు తెలిపామని అన్నారు. కొన్ని సార్లు బంగ్లాదేశ్‌లో భారత స్నేహపూర్వక ప్రభుత్వం లేకపోయినప్పటికీ మనం మాత్రం సత్సంబంధాలను కొనసాగించామని తెలిపారు. రాబోయే కాలంలోనూ ఈ బంధాన్ని కొనసాగించడంలో ఎలాంటి లోటుపాట్లు ఉండబోవని చెప్పారు. నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, గ్రామీణ బ్యాంక్ వ్యవస్థాపకుడు ముహమ్మద్ యూనస్ నేతృత్వంలో బంగ్లాదేశ్‌లో ఏర్పడిన మధ్యంతర ప్రభుత్వంపై భారత్ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని శశి థరూర్ అన్నారు. తనకు వ్యక్తిగతంగా మహమ్మద్ యూనస్ తెలుసని తెలిపారు. ఆయన అత్యంత గౌరవనీయమైన వ్యక్తి అని, ఆయన జమాత్ ఇ ఇస్లామీ, పాకిస్థానీ ఐఎస్ఐతో సత్సంబంధాలు కొనసాగించడం కంటే అమెరికాతో సత్సంబంధాలకే కాస్త మొగ్గు చూపుతారని తాను అనుకుంటున్నట్లు చెప్పారు.

## కవితకు మళ్లీ నిరాశే

జస్టిస్ విశ్వనాథన్ ధర్మాసనం నిరాకరించింది. ఎమ్మెల్సీ కవిత తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. 5 నెలలుగా కవిత జైల్లో ఉన్నారని.. ఓ ప్రజాప్రతినిధిగా, మహిళ అయిన కవితను ఇంకెంత కాలం జైల్లో ఉంచుతారు అంటూ రోహత్గీ దర్యాప్తు సంస్థల తీరును ప్రశ్నించారు. ఈ కేసులో ఇప్పటికే మనీష్ సిసోడియా, కేజ్రీవాల్ బెయిల్ పొందారని కవిత కూడా బెయిల్‌కు అర్హురాలేనన్నారు. కేసు పెట్టిన ఈడీ, సీబీఐలకు తాము నోటీసులు జారీ చేస్తామని జస్టిస్ గవాయి చెప్పారు. అయితే మధ్యంతర బెయిల్ అయినా ఇవ్వండి అని కవిత లాయర్ రోహత్గీ ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. ఇందుకు జస్టిస్ గవాయి నిరాకరించారు. దర్యాప్తు సంస్థల అభిప్రాయాలను వెల్లడించిన తర్వాతే వాదనలు వింటామని అప్పటి వరకు మధ్యంతర బెయిల్ ఇవ్వలేమన్నారు. తదుపరి విచారణను ఆగస్టు 20వ తేదీకి వాయిదా వేశారు. ఈ లోపు అఫిడవిట్ ఫైల్ చేయాలని ఈడీ, సీబీఐలకు ఆదేశాలు జారీ చేశారు. కవిత ఆరోగ్యం బాగోలేదని మెడికల్ గ్రౌండ్స్ మీద అయినా బెయిల్ మంజూరు చేస్తారని బీఆర్ఎస్ వర్గాలు ఆశలు పెట్టుకున్నాయి. అయితే పిటిషన్ దాఖలు చేసిన వెంటనే దర్యాప్తు సంస్థల వాదనలు వినకుండా బెయిల్ మంజూరు చచేేయుడం కష్టం. అందుకే.. మధ్యంతర బెయిల్ కోసం కవిత లాయర్ పట్టుబట్టారు. కానీ ప్రయోజనం లేకపోయింది. కవిత మరో పదిరోజుల పాటు జైల్లో ఉండాల్సింది. ఒకవేశ దర్యాప్తు సంస్థలు కవితపై మరీ కఠిన వైఖరి కాకుండా కాస్త సాఫ్ట్‌గా వ్యవహరిస్తే ఆమెకు బెయిల్ లభించే అవకాశం ఉంది. ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం సిసోడియాకు బెయిల్ లభించింది. ఆయన పదిహేడు నెలల పాటు జైల్లో ఉన్నారు. ఈడీ కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ కు బెయిల్ లభించింది కానీ.. సీబీఐ కేసులో లభించలేదు. ఆ బెయిల్ కోసం ఆయన ప్రయత్నిస్తున్నారు. అప్రూవర్లుగా మారిన వారంతా బెయిల్ పొందారు. కానీ కవిత మాత్రం..దాదాపుగా ఐదు నెలలుగా జైల్లో ఉన్నారు.

# స్వతంత్ర్య ఫలాలు అందరికీ అందాలన్నదే బీజేపీ లక్ష్యం

- అందుకే బంగ్లాదేశ్ ఘటనపై నోరు విప్పడం లేదు
- ముప్వెన్నెల జెండా మనందరి ఆత్మగౌరవ ప్రతీక
- నెహ్రూ కుటుంబం కోసం కుల, మత, ప్రాంతాల పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెట్టిన కాంగ్రెస్
- అంబేద్కర్ ఆలోచనలను రూపుమాపేందుకు కాంగ్రెస్ కుట్ర
- నెహ్రూ అరాచకాలవల్లే విభజన గాయాలు వెంటాడుతున్నాయి
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యలు.



**జయభేరి, కరీంనగర్:**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చైనా ఆలోచనలను అమలు చేసే వ్యక్తి అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. చైనా ఆదేశాలతోనే బంగ్లాదేశ్ ఘటనపై రాహుల్ గాంధీ నోరు విప్పడం లేదని విమర్శించారు. నెహ్రూ కుటుంబానికి రాజకీయ లబ్ది కోసం దేశ మహనీయుల త్యాగాలను కనుమరుగు చేసే కుట్ర చేస్తున్నారని, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆలోచనను తెరమరుగు చేస్తున్నారని మండిపడ్డారు. స్వతంత్ర్య ఫలాలు అందరికీ అందాలనే లక్ష్యంతోపాటు మహనీయుల త్యాగాలను స్మరించుకునేందుకు 'హర్ ఘర్ తిరంగా' పేరిట కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు.
భారతీయ యువ మోర్చా ఆధ్వర్యంలో ఈరోజు కరీంనగర్ లోని తెలంగాణ చౌక్ నుండి భారీ ఎత్తున 'హర్ ఘర్ తిరంగా' యాత్రను ప్రారంభమైంది. బండి సంజయ్ ఈ యాత్రకు విచ్చేసి తెలంగాణ చౌక్ నుండి టవర్ సర్కిల్ వరకు నడిచారు. భారీ ఎత్తున తరలివచ్చిన యువకులు, విద్యార్థులు ముప్వెన్నెల జెండాను చేత పట్టుకుని మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ కదం తొక్కారు. బండి సంజయ్ తో కలిసి అడుగులో అడుగు వేసుకుంటూ ముందుకు సాగారు. అంతకుముందు బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు బీజేవైఎం ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా యాత్రను నిర్వహిస్తున్నాం. ఇంటిపైన జాతీయ జెండాను ఎగరేయడం, సెమినార్లు నిర్వహించడం, దేశం కోసం త్యాగం చేసిన మహనీయుల విగ్రహాలను శుద్ధి చేసి పుష్పార్చన చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. మూడు రంగుల జాతీయ జెండా...మనందరి ఆత్మగౌరవ పతాకం. జెండా, ఎంజెడాలను పక్కనపెట్టి చిన్న, పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ తమ తమ ఇండ్లపై ముప్వెన్నల జెండాను ఎగరేయండి. దేశభక్తుల ఫొటోలును పంద్రాగస్టు వరకు వాట్సప్ డీపీలుగా పెట్టుకోండి. ఈ దేశాన్ని గొప్ప రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు అంబేద్కర్. అట్లాగే ఎంతో మంది మహనీయులు దేశం కోసం బలిదానం చేశారు. కాంగ్రెస్ నేతలు మాత్రం నెహ్రూ కుటుంబానికి లబ్ది చేయడమే లక్ష్యంగా చరిత్రను తెరమరుగు చేసే యత్నం చేసింది. కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని తుంగలో తొక్కాలని చూస్తోంది. అంబేద్కర్ ఆలోచనలు లేకుండా చేయాలని కుట్ర చేస్తోంది. కుల, మత, ప్రాంతాల పేరుతో ప్రజలను చీల్చే కుట్రలు చేస్తోంది. నెహ్రూ అరాచక, అనాలోచిత విధానాలవల్ల విభజన గాయాలు ఇంకా మనల్ని వెంటాడుతున్నాయి. ఆనాడు లక్షల మంది చనిపోయారు. కోట్లాది మంది నిరాశ్రయులయ్యారు. ఇవన్నీ గుర్తు చేయడంతోపాటు మహనీయులను స్మరించుకునేందుకు తిరంగా యాత్ర చేస్తున్నం. అంబేద్కర్ స్ఫూర్తితో మోదీ పాలనను కొనసాగిస్తున్నారు. 370 ఆర్టికల్ పేరుతో కాశ్మీర్ దేశంలో అంతర్భాగం కాకుండా కాంగ్రెస్ కుట్ర చేస్తే... మోదీ 370 ఆర్టికల్ ను రద్దు చేసి కాశ్మీర్ భారత్ లో అంతర్భాగమని నిరూపించిన వ్యక్తి మోదీ. రాహుల్ గాంధీ మాత్రం అంకుల్ శ్యాం పిట్రోడా వాడుతున్న అమెరికా భాషను ఉపయోగిస్తున్నడు. చైనా ఆలోచనను అమలు చేసే వ్యక్తి రాహుల్ గాంధీ. బంగ్లాదేశ్ పై రాహుల్ నోరెందుకు విప్పడు? చైనా వద్దన్నది రాహుల్ నోరు మూసుకున్నడు. కాంగ్రెస్ చేస్తున్న ఇట్లాంటి కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పికొడుతూనే... దేశ స్వాతంత్ర్యం కోసం మహనీయులు చేసిన త్యాగాలను గుర్తు చేసేందుకే మోదీ నాయకత్వంలో కేంద్రం ప్రతి ఏటా తిరంగా పండుగ కార్యక్రమాలు నిర్వహిస్తున్నం. దేశ స్వాతంత్ర్యం వచ్చింది కాంగ్రెస్ కోసం కాదు... అందరి కోసం... రాజ్యాంగ ఫలాలు నెహ్రూ కుటుంబం కోసమే కాదు... ప్రతి ఒక్కరివి. ఈ దేశంలో ఉన్న అట్టడుగునున్న పేద వాడికి సైతం రాజ్యాంగ ఫలాలు అందాలన్నదే అంత్యోదయ సిద్ధాంతం. ఇవన్నీ స్మరించుకుంటూ మహనీయుల ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలనే సంకల్పంతోనే నిర్వహిస్తున్న ఈ తిరంగా పండుగను విజయవంతం చేయాలని కోరుతున్నానని అన్నారు. తెలంగాణ ప్రజలంతా తక్షణమే మీ ఫోన్ వాట్సప్ డీపీలను మార్చండి. దేశభక్తుల ఫొటోలు, ముప్వెన్నెల జెండాను డీపీలుగా పెట్టుకోవాలి. ప్రతి భారతీయుడు తమ తమ ఇండ్లపై ముప్వన్నెల జెండాను ఎగరేయాలి. ఈ విషయంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించేందుకు భారతీయ యువ మోర్చా ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నామని అన్నారు.

# బతుకమ్మ చీరల స్థానంలో బహుమతులు

**జయభేరి, కరీంనగర్, ఆగస్టు 12:**



తెలంగాణ రాష్ట్రంలో అతిపెద్ద పండుగలు బతుకమ్మ, దసరా, బోనాలు. రాష్ట్రంలో దాదాపు అన్ని ప్రాంతాల ప్రజలు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొనే పండుగలు ఇవీ. అందుకే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ఈ పండుగలను అధికారికంగా నిర్వహిస్తున్నారు. ఇక తెలంగాణ ఉద్యమ సమయంలో బతుకమ్మ కూడా కీలక పాత్ర పోషించింది. కేసీఆర్ తనయ, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత జాగృతి పేరుతో స్వచ్ఛంద సంస్థను స్థాపించి బతుకమ్మ పండుగను రాష్ట్ర వ్యాప్తం చేసింది. తెలంగాణ ఉద్యమంలోనూ బతుకమ్మలు ఆడుతూ ఆందోళనలు చేసిన సందర్భాలు ఉన్నాయి. బోనాలు ఎత్తిన రోజులు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే కేసీఆర్ తెలంగాణ వచ్చాక బతుకమ్మ, దసరా, బోనాల పండుగలను అధికారికంగా నిర్వహించడం ప్రారంభించారు. ఇక బతుకమ్మ అంటేనే అమ్మవారు. అమ్మవారి స్వరూపమైన ఆడ పడుచులకు బతుకమ్మ సందర్భంగా చీరలు పంపిణీ చేసే కార్యక్రమానికి కూడా కేసీఆర్ శ్రీకారం చుట్టారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను ఆదుకునేందుకు, అదే సమయంలో బతుకమ్మ పండుగ వేళ.. ధనిక, పేద అని తేడా లేకుండా ఆడపడుచులంతా కొత్త బట్టలు కట్టుకోవాలన్న ఉద్దేశంతో బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. రేషన్ కార్డులో పేరు ఉన్న మహిళలందరికీ చీరలు పంపిణీ చేస్తూ వచ్చారు. 2023 బతుకమ్మ పండుగ సంరద్భంగా కూడా చీరలు పంపిణీ చేశారు. ఎన్నికల కోడ్ తర్వాత పంపిణీ ఆపేశారు. అయితే ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యారు. బతుమక్మ చీరల పంపిణీ విషయంలో రేవంత్‌రెడ్డి సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ఏటా బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు ఉచితంగా అందిస్తున్న చీలర పంపిణీ నిలిపివేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. చీరల తయారీకి ఇప్పటి వరకు ఆర్డర్ ఇవ్వలేదు. దీంతో పంపిణీ లేదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బతుకమ్మ చీరల పంపిణీ పెద్ద గోల్‌మాల్ పథకమని సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ఆరోపించారు. దీంతో బతుకమ్మ చీలర పథకం స్థానంలో మరో స్కీమ్ తీసుకురావాలని రేవంత్‌రెడ్డి ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు ఇప్పటికే నిర్ణయానికి వచ్చింది. అయితే బతుకమ్మ చీరల పంపిణీ నిలిపివేస్తే మహిళా లోకం నుంచి ఏమైనా అభ్యంతరాలు వ్యక్తం అవుతాయా అని చిన్న చిన్న లీకుల ద్వారా అభిప్రాయం తెలుసుకునే పని చేస్తోంది. గత ప్రభుత్వం అందించిన ఈ బతుకమ్మ చీరలు నాసిరకంగా ఉన్నాయని మహిళల్లోనే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. కేసీఆర్ కూతురు కవిత ఈ చీరలే కడుతుందా అని కూడా విమర్శించారు. కొన్ని చోట్ల చీరలను దహనం చేశారు. ఈ నేపథ్యంలో చీరల పంపిణీకి బదులుగా మరో స్కీమ్ పై అధికారులు కసరత్తు చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది. దీంతో మహిళలకు ఏమైనా బహుమతులు ఇస్తారా? ఆర్థిక సాయం చేస్తారా? అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. పండగల సమయంలో వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు ఏమైనా బహుమతులు ఇస్తున్నాయా? నగదు పంపిణీ చేస్తున్నాయా? అనే విషయాలను పరిశీలించి, బతుకమ్మ చీరల పంపిణీ నిలిపివేస్తున్నట్లు అధికారికంగా ప్రకటిస్తారని తెలుస్తోంది. తెల్ల రేషన్ కార్డు ఉన్న కుటుంబాల్లోని మహిళలకు నగదు ఇస్తే ఎలా ఉంటుంది? ఒక్కొక్కరికి ఎంత ఇవ్వాలి? ఆర్థిక సాయం చేస్తే ప్రభుత్వంపై ఎంత భారం పడుతుంది వంటి వివరాలు తెలుసుకుంటున్నట్లు సమాచారం.

## తుంగ భద్రమేనా..?

ఎగువ కర్ణాటకలో ముందస్తుగా కురుస్తున్న భారీగా వరద నీరు చేరింది. జలాశయం కెపాసిటీ 105 టీఎంసీలు. ఇప్పటికే జలాశయంలో వరద ప్రవాహానికి 105 టీఎంసీల నీరు చేరింది. ఎగువన వర్షాలకు వరద నీరు వస్తుండడంతో 33 గేట్లు ఉన్న తుంగభద్ర జలాశయం 29 గేట్ల ద్వారా నీటిని నదిలోకి డ్యాం అధికారులు విడుదల చేస్తున్నారు. ఇదే సమయంలో గత శనివారం అర్ధరాత్రి గేట్లు ఎత్తుతున్న టైంలో 19వ గేటు వరద ప్రవాహానికి కొట్టుకపోయింది. తుంగభద్ర జలాశయం 19వ గేటు కొట్టుకుపోవడంలో ఎవరి తప్పిదం ఉంది అన్న కోణంలో కూడా విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది. నాన్ రైనీ సీజన్‌లో డ్యాం నిర్వహణను సరిగా జరిగిందా లేదా అని ఆరా తీస్తున్నారు. అసలు అప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు అధికారులు తీసుకున్నారా లేదా అని క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉంటుంది. డ్యాం భద్రత గేట్ల మెయింటెనెన్స్ గ్రీస్ చైన్స్ ఇలాంటివన్నీ కూడా అధికారులు దగ్గరుండి పరిరక్షించాల్సి ఉంది. డ్యాం అధికారులు మాత్రం ఈ ఏడాది కూడా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని చెబుతున్నారు. చైన్లకు గ్రీసు పూయడం ఇతర నిర్వహణ పనులు చేసినట్లు పేర్కొంటున్నారు. అయితే వర్షాకాలం ముందు డ్యామ్‌ను పరిశీలించి జాతీయ డ్యామ్‌లా బద్రతసంస్థకు అంత సవ్యంగానే ఉన్నట్లు చెప్పిన నివేదికను అధికారులు చూపిస్తున్నారు. డామ్ నిర్వహణ పనులు సవ్యంగా జరిగే ఉంటే డ్యాంలోని 19వ డేటు ఎందుకు కొట్టుకుపోయింది అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏదైనా డ్యాం నిర్మాణం చేపట్టడంలో గేట్లు ప్రధాన భూమిక పోషిస్తాయి.
నీటి నిల్వను అడ్డుకునేందుకు నీటిని దిగువకు వదలడానికి డ్యామ్ గేట్లను ఏర్పాటు చేస్తారు. డ్యామ్ నిర్మాణాన్ని డాం కెపాసిటీని బట్టి డ్యామ్ గేట్లను ఏర్పాటు చేస్తారు. అయితే ఇందుకు సంబంధించి ఒక్కొక్క గేటు సుమారు 40 టన్నుల బరువు ఉంటుంది. ఒక్కొక్క గేటు జీవితకాలం 40 నుంచి 45 ఏళ్లు ఉంటుంటుంది. తుంగభద్ర జలాశయంలో మాత్రం డ్యాం నిర్మాణం చేపట్టడం నుంచి ఇప్పటివరకు అవే గేట్లు వాడుతున్నారు ఇప్పటివరకు సుమారుగా అంటే 69 ఏళ్లుగా తుంగభద్ర జలాశయంలో అవే గేట్లను వాడుతున్నారు. ఎక్కడైనా డ్యాంల నిర్మాణం చేపడుతున్నప్పుడు డ్యాం గేటు కొట్టుకుపోయినప్పుడు స్టాప్ లాక్ సిస్టంను అధికారులు ఏర్పాటు చేస్తారు. తుంగభద్ర జలాశయం నిర్మాణం చేపడుతున్న సమయంలో స్టాప్ లాక్ సిస్టం లేకపోవడంతోనే నీటిని అడ్డుకోలేకపోతున్నట్లు తెలుస్తోంది. దాదాపుగా తుంగభద్ర జలాశయం 69 సంవత్సరాల క్రితం నిర్మాణం చేపట్టారు.
అప్పట్లో స్టాప్ లాక్ సిస్టం లేకుండానే డ్యాం నిర్మాణం చేపట్టారు. కేవలం చైన్ లింకు ద్వారానే గేట్లను ఆపరేట్ చేసే పరిస్థితి ఇక్కడ ఉంది. నాలుగేళ్ల క్రితం కేంద్ర జల సంఘం తుంగభద్ర డ్యామ్ ను పరిశీలించంది స్టాప్ లాక్ గేట్లు ఏర్పాటు లేదా ఏదైనా ప్రత్యామ్నయం చూడాలని సూచించింది. లేకుంటే డ్యామ్‌కే నష్టమని సిడబ్ల్యుసి చెప్పిందని ఎలా ఉండాలో సూచించలేదని ఒక సీనియర్ ఇంజనీర్ పేర్కొన్నట్లు తెలుస్తోంది. తాత్కాలిక గేట్లను అమర్చే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే 19వ గేటు దగ్గర పనులను చురుకుగా చేస్తున్నారు. నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో కొంత పనులు ఆలస్యంగా కొనసాగుతున్నాయి. తాత్కాలిక గేటును పెట్టేందుకు హోసాహల్లిలోని హిందుస్థాన్ ఇంజనీరింగ్ వర్క్స్ సంస్థ ప్రాథమికంగా పనులు ప్రారంభించింది. తాత్కాలిక గేటు ఏర్పాటుకు మరో రెండు మూడు రోజులు సమయం పట్టేలా ఉందని అధికారులు చెబుతున్నారు. పూర్తిస్థాయి గేట్లు ఏర్పాటు చేయాలంటే డ్యాంలోని 60 టీఎంసీ నీరు బయటకు వెళ్లేంతవరకు ఏర్పాటు చేయలేమని అంటున్నారు.

# మాదకద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణా పై అవగాహన ర్యాలీ

**జయభేరి, దేవరకొండ :**




దేవరకొండ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎంకేఆర్ ప్రభుత్వా డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల విద్యార్థులతో మాదకద్రవ్యాల నిర్మూలనకై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ ఎస్ శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్, జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ అధికారి బి.సంతోష్ సూచనల మేరకు దేవరకొండ పట్టణంలో ర్యాలీ అవగాహన కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. సమాజంలో నేడు జరిగే అనేక సంఘటనలు చూస్తే చాలా బాధ వేస్తుందని, చిన్నపిల్లలు సైతం గంజాయి,మాదకద్రవ్యాలకు బానిసలు కావడం, సమాజ రుగ్మతలకు కారణం అవుతున్నాయని అన్నారు. అనేక రకాలుగా జరిగే నేరాలకు వీటితో సంబంధం ఉన్నట్లు కనబడుతుందన్నారు. సమాజం కూడా ఇలాంటి వారి పట్ల జరిగే సంఘటనల పట్ల దృష్టిసాధించాలని అన్నారు. గంజాయి పై ఉక్కు పాదం మోపుతున్నామని హెచ్చరించారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గంజాయి, మత్తు పదార్థాల విక్రయాలకు పాల్పడే వారి సమాచారాన్ని ఇవ్వాలని కోరారు. సమాచారం అందించిన వారి పేర్లు గోపియంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ ప్రొహిబిషన్ ఎక్సైజ్ సిఐ శ్రీనివాస్, ఎస్సై ఏ.నరసింహ, బి నర్సింగరావు, ఎక్సైజ్ శాఖ సిబ్బంది ఎం కె ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమావత్ రవి, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మల్లయ్య, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.





## లక్ష్మాపూర్ లో మాజి సర్పంచ్ సింగం సత్తయ్య వర్ధంతి కార్యక్రమం

**జయభేరి, ఆగస్టు 12:**

మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మండలం లక్ష్మాపూర్ గ్రామ మాజి సర్పంచ్ సింగం సత్తయ్య ప్రథమ వర్ధంతినీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సింగం సత్తయ్య గ్రామానికి అందించిన సేవలు ఎనలేనివని ఈ సందర్భంగా పలువురు నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యదర్శి పుట్టం పురుషోత్తం రావ్, కుటుంబ సభ్యులు,పలువురు నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి ముందుకొచ్చిన మాజీ సర్పంచ్

- పాఠశాలకు నూతన రంగులు వేయించిన గౌరీ కుమారి వెంకటేష్



**జయభేరి, ఆగస్టు 12:**

ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అన్న అంటారు పెద్దలు. ఇదే నానుడినీ దృష్టిలో ఉంచుకొని అలియాబాద్ మాజి సర్పంచ్ గౌరీ కుమారి వెంకటేష్ ప్రభుత్వ పాఠశాలకు తన వంతు సాయం అందించారు . అలియాబాద్ లోని గాంధీనగర్ ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రంగులు వేయించేందుకు మాజీ సర్పంచ్ ముందుకొచ్చారు. తమ స్వంత నిధులు వెచ్చించి పాఠశాలలో రంగులు వేయించి నూతనంగా తీర్చి దిద్దారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనకు దాతలు ముందుకు రావాలని ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ కోరారు.



## పోతాయిపల్లి చౌరస్తా వద్ద రోడ్డు ప్రమాదం

- రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఢీకొన్న బైక్
- చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**జయభేరి, ఆగస్టు 12:**

రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తిని అతివేగంగా వచ్చిన బైక్ ఢీకొంది. ఈ ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా చికిత్స పొందుతూ అతను మరణించాడు. ఈ సంఘటన మేడ్చల్ జిల్లా శామీర్ పేట్ మండలం పోతాయిపల్లి చౌరస్తా వద్ద చోటు చేసుకుంది. జమ్ముల కేశవులు అనే వ్యక్తి ఈ నెల 11న పోతాయిపల్లి చౌరస్తా వద్ద రోడ్డు దాటుతుండగా అదే సమయంలో TG 08 4058 నంబరు గల బైక్ పై ముగ్గురు వ్యక్తులు అతి వేగంగా వచ్చి కేశవులును డీకొన్నారు. దీంతో అతను రోడ్డుపై పడిపోవడంతో తలకు, ఎడమ కాలికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు అంబులెన్స్ సహాయంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. కాగా అక్కడ చికిత్స పొందుతూ కేశవులు మృతి చెందారు. ఈ ఘటనపై శామీర్ పేట్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కళాశాలలో యాంటి ర్యాగింగ్ అవగాహన సదస్సు

- విద్యార్థులు ర్యాగింగ్ జోలికి వెళ్లి తమ భవిష్యత్ ను నాశనం చేసుకోవద్దు - సీఐ శ్రీనాథ్

**జయభేరి, ఆగస్టు 12:**



విద్యార్థులు ర్యాగింగ్ కు దూరంగా ఉండాలనీ శామీర్ పేట్ సీఐ శ్రీనాథ్ సూచించారు. శామీర్ పేట్ లోని ఐపీఈ మేనేజ్ మెంట్ కళాశాలలో యాంటి ర్యాంగింగ్ క్యాంపెయిన్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనాథ్ మరియు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీనివాస మూర్తి, డీన్ శ్రీకాంత్, ప్రొఫెసర్ డాక్టర్ రాజ్ కుమార్ పిళ్ళై తో పాటు మరికొంత మంది ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో ఈ నెల 29 న నిర్వహించే స్పోర్ట్స్ మీట్ కు సంబందించి లోగో మరియు పోస్టర్ ను సీఐ శ్రీనాథ్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళాశాలల్లో ర్యాగింగ్ నిషేధించారని, ఎవరైనా ర్యాగింగ్ కు పాల్పడితే కళాశాల ర్యాగింగ్ కమిటీకి గాని, కళాశాల యాజమాన్యానికి లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఎవరైనా ర్యాగింగ్ కు పాల్పడితే నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ర్యాగింగ్ చట్టం కింద కేసు నమోదు అయితే విద్యార్థులు తమ బంగారు భవిష్యత్ ను నాశనం చేసుకున్న వారవుతారని పేర్కొన్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకొని అటు తల్లిదండ్రులకు ఇటు కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

## వ్యాసరచన పోటీల్లో ఎంపికైన కేటీఎస్ విద్యార్థులు



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మండల స్థాయిలో నిర్వహించిన మాదకద్రవ్యాల దుర్వినియోగం,అక్రమ రవాణాపై వ్యాసరచన పోటీల్లో సోమవారం పట్టణానికి చెందిన కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు మొదటి, రెండవ స్థానంలో నిలిచి, జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సిమర్ల రాజ్ కుమార్ రెడ్డి జిల్లా స్థాయికి ఎంపికైన తమ పాఠశాల విద్యార్థులుకే. గురు నాయక్, షాఫియా కౌసర్ లను సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 14వ తేదీన నిర్వహించే జిల్లా స్థాయి పోటీల్లో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి , గెలుపొంది తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పాఠశాలకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు.ప్రతి విద్యార్థి తమ పుస్తకాలలో ఉన్న పాఠ్యంశాలను మాత్రమే కాకుండా, సమాజం పట్ల అవగాహన పెంచుకొని అన్ని విషయాల పట్ల విజ్ఞానాన్ని మెరుగుపరుచుకోవాలని అన్నారు. అలాగే మనం ఏదైతే చదువుతున్నామో దాన్ని నిజజీవితంలో ఉపయోగపడే విధంగా ప్రయత్నం చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాను మాదకద్రవ్యాల రహిత జిల్లాగా మార్చడానికి ప్రతి ఒక్కరు దోహదపడాలని అన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో వీరితోపాటు ప్రిన్సిపల్ నవీన్ గౌడ్, వైస్ ప్రిన్సిపాల్ మోహమ్మద్ అన్వర్ హుస్సేన్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవ వేడుకలు వైభవంగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**జయభేరి, కామారెడ్డి, ఆగస్టు12:**



కామారెడ్డి జిల్లా ఆగస్టు 15 న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించడానికి జిల్లా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు.కామారెడ్డి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో సోమవారం జిల్లా స్థాయి అధికారులతో స్వతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు వీఐపీలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు కూర్చోవడానికి కావలసిన ఫర్నిచర్ సమకూర్చాలన్నారు. సౌండ్ సిస్టం, షామియానాలు, తాగునీరు, పరేడ్ గ్రౌండ్ ముస్తాబు, శకటాలు, స్టాళ్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పోలీస్, అగ్నిమాపక, అటవీ, జిల్లా వైద్య, ఆరోగ్య, వ్యవసాయం, రోడ్డు రవాణా శాఖలో ఆధ్వర్యంలో శకటాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లా ఉద్యానవన, మిషన్ భగీరథ, మునిసిపల్, గ్రామపంచాయతీ, వ్యవసాయం, విద్య, అటవీ శాఖ, మహిళ, శిశు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ, ఉపాధి హామీ, ఇందిరా క్రాంతి పథకం శాఖల ఆధ్వర్యంలో స్టాళ్లను ఏర్పాటు చేయాలని చెప్పారు. పాఠశాల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో సిపిఓ రాజారాం, డిఆర్డిఓ సురేందర్, జెడ్పిసీఈవో చందర్ నాయక్, డిపిఓ శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారిని భాగ్యలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ ఈడి దయానంద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## శుభకార్యాలు, పండుగలకు బస్సుల బుకింగ్ పై 10 శాతం రాయితీ



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ ఆర్టీసీ డిపో బస్సులను శ్రావణమాసం శుభ ముహూర్తాల సందర్భంగా పండుగలు, శుభ కార్యాలకు బస్సులు బుక్ చేసుకున్నవారికి 10 శాతం రాయితీ సౌకర్యం కల్పించినట్లు డిపో మేనేజర్ తల్లాడ రమేష్ బాబు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సెప్టెంబర్ 3 వరకు వరకు ఈ అవకాశం ఉంటుందని తెలిపారు. అన్ని రకాల బస్సులకు ఈ రాయితీ సౌకర్యం వర్తిస్తుందని తెలిపారు. డిపో పరిధిలోని ప్రజలు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితంగా ఉంటుందని, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

## జయభేరిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు

**జయభేరి, మేడిపల్లి :**




జయభేరిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. 'ఇద్దరం ఒక్కటై.. దోచుకో... దాచుకో' పేరుతో సోమవారం జయభేరిలో ప్రచురితమైన కథనానికి మేడిపల్లి తాసిల్దార్ హసీనా స్పందించారు. ఆమె ఆదేశాలతో బోడుప్పల్ సర్వేనెంబర్ మూడులో గల ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం కూల్చివేశారు. వక్ఫ్ స్థలంలో అనుమతి లేకుండా నిర్మిస్తున్న కట్టడాలను గతంలో రెండుసార్లు కూల్చిన మళ్లీ నిర్మాణం చేపట్టినడంతో... ఈసారి కూడా ఎమ్మార్వో తన సిబ్బందితో కూల్చివేతలు చేపట్టారు. ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు జరిపితే ఉపేక్షించేది లేదని ఎమ్మార్వో హసీనా అన్నారు.

## రమావత్ జాంకి మృతి బాధాకరం

- నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మండలం రత్య తండాకు చెందిన మృతి రమావత్ జాంకి బాధాకరం అని నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.సోమవారం రత్య తండాలో జాంకి మృత దేహానికీ పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జాంకి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.జాంకి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.ఆయన వెంట రమావత్ రమేష్,వాడిత్య బాలు, గోపి తదితరులు ఉన్నారు.




# ఎన్నో తిరస్కారాల్ని ఎదుర్కొన్నా!

ప్రస్తుతం పాన్ ఇండియా స్థాయిలో అగ్ర కథానాయికగా చలామణి అవుతున్నది కన్నడ సోయగం రష్మిక మందన్న. తెలుగు, హిందీ భాషల్లో భారీ చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది. అయితే తాను ఈ స్థాయికి చేరుకోవడానికి ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నానని, కెరీర్ తొలినాళ్లలో అవకాశాలు అంత సులభంగా రాలేదని చెప్పింది రష్మిక. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్ తొలినాటి కష్టాల గురించి చెప్పుకొచ్చిందీ భామ. ఆమె మాట్లాడుతూ 'ఆడిషన్స్‌కు వెళ్లిన ప్రతీసారి తిరస్కారాలు ఎదురయ్యేవి. కొందరైతే నేను నటిగా సక్సెస్ కావడం చాలా కష్టమని మాట్లాడేవారు. అవకాశాలు రావనే దిగులుతో కన్నీళ్లతో ఇంటికి వచ్చిన సందర్భాలు చాలా ఉన్నాయి. ఓ సినిమా సెలెక్ట్ చేసిన తర్వాత మూడు నెలల పాటు వర్క్‌షాప్ నిర్వహించారు. ఆ తర్వాత ఈ ప్రాజెక్ట్‌ను క్యాన్సిల్ చేశారు. ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నా.. ఎప్పుడూ సినీరంగం నుంచి తప్పుకోవాలనుకోలేదు. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ, నటిగా ప్రతీ సినిమాకు ప్రతిభను మెరుగుపరచుకుంటూ ఈ స్థాయికి వచ్చా' అని చెప్పింది. ఆమె మాటలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. ప్రస్తుతం రష్మిక మందన్న తెలుగులో 'పుష్ప 2' తో పాటు మరో మూడు చిత్రాల్లో నటిస్తున్నది.





# కొత్త ప్రపంచాన్ని చూస్తారు

"తంగలాన్' థ్రిల్లింగ్ అడ్వెంచరస్ మూవీ. కోలార్ గోల్డ్‌ఫీల్డ్స్ నేపథ్యంలో ప్రేక్షకులను సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుంది. తప్పకుండా థియేటర్స్‌లో చూసి ఈ అడ్వెంచరస్ జర్నీని ఆస్వాదించండి' అన్నారు హీరో విక్రమ్. ఆయన తాజా పీరియాడిక్ చిత్రం 'తంగలాన్' ఈ నెల 15న ప్రేక్షకుల ముందుకొస్తున్నది. పా.రంజిత్ దర్శకుడు. తెలుగులో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ విడుదల చేస్తున్నది. సోమవారం విజయవాడలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా విక్రమ్ మాట్లాడుతూ 'నా 'అపరిచితుడు' మూవీ దేశంలోనే అత్యధిక రోజులు విజయవాడలో ఆడింది. తెలుగు ప్రేక్షకులు నాపై ఎంతో అభిమానం కనబరుస్తారు. 'తంగలాన్' సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తుంది' అన్నారు. ఈ సినిమాలో తాను పోషించిన ఆరతి పాత్ర కెరీర్‌లో బెస్ట్‌రోల్ అని కథానాయిక మాళవిక మోహనన్ తెలిపింది. సినిమాలో విక్రమ్ మేకోవర్, పాత్ర కోసం ఆయన పడిన కష్టం ప్రతి ఒక్కరిని ఆశ్చర్యపరుస్తుందని నిర్మాత ధనుంజయన్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి నిర్మాణ సంస్థ: స్టూడియోగ్రీన్, నీలమ్ ప్రొడక్షన్స్, నిర్మాత: కేఈ జ్ఞానవేల్‌రాజా, దర్శకత్వం: పా.రంజిత్.



# నాగార్జున మాస్ రీరిలీజ్

ప్రస్తుతం తెలుగు సినీరంగంలో రీరిలీజ్‌ల ట్రెండ్ నడుస్తున్నది. అలనాడు బ్లాక్‌బస్టర్ హిట్స్‌గా నిలిచిన చిత్రాలను మరలా ప్రేక్షకులకు ముందుకుతీసుకొస్తున్నారు. ఈ వరుసలో నాగార్జున నటించిన సూపర్‌హిట్ మూవీ 'మాస్' ఫోర్‌కే ఫార్మాట్‌లో ఆయన జన్మదినం సందర్భంగా ఈ నెల 29న రీరిలీజ్ కానుంది. 20 ఏళ్ల క్రితం విడుదలైన ఈ చిత్రం ఆ రోజుల్లో నాగార్జునకు అత్యధిక వసూళ్లు అందించిన చిత్రంగా రికార్డు సృష్టించింది. రాఘవ లారెన్స్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై నాగార్జున నిర్మించారు. ఈ సినిమాలో జ్యోతిక, ఛార్మి, రఘువరన్, రాహుల్‌దేవ్ ప్రధాన పాత్రల్లో నటించారు. దేవిశ్రీప్రసాద్ సంగీతాన్నందించారు. ఫోర్‌కే ఫార్మాట్‌లో రీరిలీజ్ అవుతున్న ఈ చిత్రం నాగార్జున అభిమానులను అలరిస్తుందని చిత్ర బృందం పేర్కొంది.

# ప్రేమోత్సవం

దిలీప్‌ప్రకాష్, రెజీనా కసాండ్రా జంటగా నటిస్తున్న ప్రేమకథా చిత్రం 'ఉత్సవం'. అర్జున్‌సాయి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి సురేష్ పాటిల్ నిర్మాత. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 13న విడుదల చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ రిలీజ్ చేయబోతున్నది. దర్శకుడు మాట్లాడుతూ 'ప్రేమ, కుటుంబ అనుబంధాల నేపథ్యంలో సాగే బ్యూటీఫుల్ ఎంటర్‌టైనర్ ఇది. హృదయాన్ని స్పృశించే భావోద్వేగాలతో పాటు చక్కటి వినోదంతో ఆకట్టుకుంటుంది. కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది' అన్నారు. ప్రకాష్‌రాజ్, నాజర్, రాజేంద్రప్రసాద్, బ్రహ్మానందం, అలీ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనూప్‌రూబెన్స్, రచనదర్శకత్వం: అర్జున్‌సాయి.



Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com